క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దు
సీఐ ఆవుల భాస్కర్



గురజాల రూరల్ : గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఆవుల భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో సోమవారం డ్రోన్ కెమెరాలతో గ్రామం నలుమూలల పరిశీలించారు. గ్రామ శివారుల్లో ఏమైనా అసాంఘీక కార్యకలాపాలు చేపడుతున్నారా లేదా నాటు సారా బట్టీలు ఏమైనా ఉన్నాయా.. అని డ్రోన్ ద్వారా నిశితంగా పరిశీలించారు. గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. సీఐతో పాటు ఎస్ఐ వై వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంఈఓ-1గా జఫ్రుల్లా ఖాన్



మాచర్ల రూరల్: మాచర్ల ఇన్‌చార్జి మండల విద్యాశాఖాధికారి-1గా సయ్యద్ జఫ్రుల్లా ఖాన్ నియమితులయ్యారు. ఆయన వినుకొండ ఎంఈఓ-1గా పనిచేస్తూ అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ఆర్‌జేడీ కార్యాలయంలో నుంచి ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటి వరకు ఎంఈఓ1 గా పనిచేసిన కాంతారావు గత నెల మృతి చెందగా ఆ ఖాళీని భర్తీ చేశారు.

రేపు విద్యుత్ వినియోగదారులకు లోక్ అదాలత్

పిడుగురాళ్ల: ఈ నెల 22న పిడుగురాళ్ల శివారులోని కొండమోడు వద్ద గల పిడుగురాళ్ల సబ్ డివిజన్ కార్యాలయంలో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ సైదారావు సోమవారం తెలిపారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. ఇందులో విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంతోపాటు, అవగాహన కూడా కల్పించటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ సీజీఆర్ఎఫ్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్ హాజరై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తారని ఆయన తెలిపారు.

నేడు మాచర్లలో ఉద్యోగ మేళా

మాచర్ల : డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు అధికారులు సోమవారం తెలిపారు. నాలుగు ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉద్యోగ మేళా జరుగుతుందన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు తగిన ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి
మున్సిపల్ కమిషనర్ వేణుబాబు



మాచర్ల: పట్టణంలోని ఆధార్ కార్డులో ఇప్పటి ఆధార్ కార్డు లేని ప్రతి ఒక్కరూ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పుట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆధార్ కార్డు నమోదు చేయని వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తుందన్నారు. నేటి నుంచి 24వ తేదీ వరకు పట్టణ పరిధిలోని రోప్ వే కాలనీ, 9వ వార్డు, పూర్ణయ్య షెడ్డు బజారులోని సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో ఆధార్ కార్డులను నమోదు చేసుకోవాలన్నారు.

విస్తృతంగా వైద్య పరీక్షలు



క్రోసూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ధనుష్, దొడ్లేరులో డాక్టర్ సాద్, డాక్టర్ సిరి చందన పాల్గొన్నారు. పుట్టుకతో వచ్చే గుండె జబ్బులు, చెవుడు, అంధత్వం, మానసిక ఆరోగ్య సమస్యలు లాంటి వ్యాధులను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ధనుష్ చెప్పారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు ఉన్న వారిని గుర్తించి, వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే కుష్టు సర్వే చేపట్టారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో...?

- నేటికీ తెరుచుకోని వెబ్‌సైట్
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- రోజూ సచివాలయాలకు వస్తున్న దరఖాస్తులు



పులిపాడు గ్రామ సచివాలయం

పిడుగురాళ్ల: కూటమి ప్రభుత్వం కొలువు దీరి నెలలు గడిచిపోతున్నాయి. ఇంత వరకు కొత్త పింఛన్ల పంపిణీపై ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదు. గతేడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ ఇంత వరకు ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదు సరికదా కనీసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ కూడా తెరవలేదు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో అర్హులైన లబ్ధిదారులు కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

తప్పని ఎదురు చూపు

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులకు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం పింఛన్ మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవంతో గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురుచూపులు తప్పడం లేదు. దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు రోజు పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళ్తున్నారు. ప్రభుత్వం వెబ్‌సైట్ తెరవకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి సమాచారం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

50 ఏళ్లకే పింఛన్ గాలికేనా..?

సార్వత్రిక ఎన్నికలలో బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని చెప్పిన హామీ గాలికి వదిలేశారని బీసీ వర్గానికి చెందిన వారు ప్రశ్నిస్తున్నారు. బీసీలకు సమన్యాయం చేస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని అడుగుతున్నారు. బూటకపు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వారు వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో పక్కాగా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పక్కాగా పింఛన్లు అందించేవారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా వలంటీర్లు దరఖాస్తు పూర్తి చేసి సచివాలయాల్లో ఇస్తే పింఛన్లు మంజూరయ్యేవి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్ల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు



కొత్త పింఛన్ల దరఖాస్తు కోసం ప్రభుత్వం నుంచి వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. ఇప్పటికే సచివాలయాలకు దరఖాస్తులు వస్తున్నాయి. ప్రస్తుతం పింఛన్లపై విచారణ జరుగుతుంది. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు విచారణ చేస్తున్నాం. వెబ్‌సైట్ వచ్చిన వెంటనే కొత్త పింఛన్ల దరఖాస్తులను స్వీకరిస్తాం.

– పర్వతనేని శ్రీధర్, మున్సిపల్ కమిషనర్, పిడుగురాళ్ల

బీసీలకు చట్ట భద్రత కల్పించాలి



ఎన్నికల హామీలలో భాగంగా చంద్రబాబు బీసీలకు 50 సంవత్సరాలకు పింఛన్ ఇస్తామని చెప్పి, ఇంత వరకు అమలు చేయలేదని, వెంటనే ఎన్నికల హామీలను నెరవేర్చాలని, అలాగే ఎస్సీ, ఎస్టీల మాదిరి బీసీలకు చట్ట భద్రత కల్పించాలన్నారు.

– మందా సుధీర్, వైఎస్సార్‌సీపీ పట్టణ యూత్ అధ్యక్షుడు, పిడుగురాళ్ల

హామీలను నెరవేర్చాలి



ఎన్నికల ముందు చెప్పిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు సర్కార్ పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలయినా హామీలను నెరవేర్చలేదు. పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఇప్పటి వరకు వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే వలంటీర్లే ఇంటి వద్దకు వెళ్లి దరఖాస్తు చేయించేవారు.

– చల్లా పిచ్చిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పిడగురాళ్ల

హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి



పిడుగురాళ్ల: హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు అన్నారు. పట్టణంలోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో రోడ్డు భద్రతపై హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ప్రయాణించటం వలన ప్రాణాలను కాపాడుకోవచ్చని, చిన్నపాటి నిర్లక్ష్యం వలన ఎంతో మంది ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని, హెల్మెట్ ప్రయాణం సురక్షిత ప్రయాణమని తెలియజేశారు. అనంతరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం నుంచి పిడుగురాళ్ల ఐలాండ్ సెంటర్ వరకు హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గురజాల : గురజాల సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఏడీఈ సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. పత్రికా ప్రకటనలో గురజాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి



రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమంలో ఎంవీఐ, సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషిరెడ్డి

దాచేపల్లి : రహదారి భద్రత నియమాలు తప్పక పాటించాలని మాచర్ల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.శేషిరెడ్డి అన్నారు. గామాలపాడు, సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శేషిరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిపుల్ రైడింగ్ వంటి వాటి వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవింగ్‌పై పూర్తి అవగాహన ఉన్న వారు వాహనాలు నడపాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు ఉల్లఘించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కారు డ్రైవ్ చేసే సమయంలో సీటు బెల్టు ధరించాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో సాగర్ సిమెంట్ ప్లాంట్ హెడ్ సుబ్బారావు, అధికారులు సంజయ్‌కుమార్‌సింగ్, వేణు, తారక్, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ పంట ఉత్పత్తులతో ఎంటీ విజయలక్ష్మి తదితరులు

రాజుపాలెం: ప్రకృతి వ్యవసాయం ఆహారోత్పత్తులు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని క్రోసూరు డివిజన్ ఎంటీ విజయలక్ష్మీ తెలిపారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మీ మాట్లాడుతూ రసాయనిక మందులు వాడకుండా పెరటి తోటలో పండించిన తోటకూర, పాలకూర, కొత్తిమీర, పొదీన, క్యారెట్, బీట్రూట్, టమోట, చిక్కుడు, దోస మొదలగు కూరగాయలను రైతుల వద్ద నుంచి సేకరించి విక్రయ కేంద్రాన్ని ఎర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద విక్రయ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎంటీ అంజలి, తేజశ్రీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

బెల్లంకొండ(పెదకూరపాడు): ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని మండల మార్కెటింగ్ ఎంటీ అంజలి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏ గ్రేడ్, ఏటీఎం, పెరటి తోటల్లో పండించిన ఆకు కూరలు, కూరగాయల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు, స్థానికులు వీటిని కొనుగోలు చేశారు. వాల్యూ చైన్ ఎస్ఎఫ్ఎఫ్ తేజశ్రీ, శ్రీరామయ్య, డీఎంఎంటీ హజరబీ, యూనిట్ ఇన్‌చార్జ్ మాధవి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు రుచిగా ఉంటాయి
యూనిట్ ఇన్‌చార్జి కొత్తపల్లి రమేష్



దాచేపల్లి : ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే ఉత్పత్తులు ఎంతో రుచికరంగా ఉంటాయని యూనిట్ ఇన్‌చార్జి కొత్తపల్లి రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తులతో ఆహార పదార్థాలు ఏ విధంగా తయారు చేసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని ఆరోగ్యకరమైన ఆహారం తినాలన్నారు. ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద స్టాల్ ఏర్పాటు చేసి అనేక రకాల ప్రకతి వ్యవసాయ ఉత్పత్తులను స్టాల్‌లో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మునగా నిమ్మయ్య తదితరులున్నారు.

విద్యార్థిని స్కూల్ ఫీజు చెల్లింపు

సత్తెనపల్లి: కరోనా మహమ్మారి ఎన్నో జీవితాలను కబళించిందిదని, చిన్నారులను అనాథలను చేసిందని వీ ఆర్ విత్ యూ సంస్థ బాధ్యులు అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థిని భోగివర్తి బ్లెస్సికి పాఠశాల ఫీజును సంస్థ సభ్యుడు బొలిశెట్టి సందీప్ చెల్లించారు. పాఠశాల ప్రిన్సిపల్ అంజలీదేవి సంస్థ సేవలను కొనియాడారు. పేద విద్యార్థికి విద్యా దానం జీవితాంతం గుర్తుండి పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ప్రదీప్, అల్లాబక్షు ఉన్నారు.

కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం క్యాలెండర్‌ను ఆ సంఘం గౌరవాధ్యక్షుడు గుంటూరు విజయ్ కుమార్ సోమవారం పుతుంబాక భవన్‌లో ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాద్‌రావు, కార్యదర్శి షేక్ సిలార్ మసూద్, సహాయ కార్యదర్శి కోట అంజనేయులు, సహాధ్యక్షుడు సురేష్, సహాయ కార్యదర్శి ఏసు, ఉపాధ్యక్షుడు కొండలు, కోశాధికారి వినుకొండ ఆంజనేయులు, రైతు సంఘం అధ్యక్షుడు గుంటుపల్లి బాల కృష్ణ ఉన్నారు.

పలు సమస్యల పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు



మాచర్ల: గుడ్ మార్నింగ్ మాచర్ల కార్యాక్రమం ద్వారా పలు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. సోమవారం ఆయన 13, 14, 15 వార్డులలో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పురపాలక సంఘ అధికారులను వెంటనే పరిష్కరించాలని సూచనలు చేశారు. 13వ వార్డులోని బాలునాయక్ కుమారుడు విద్యుత్ షాక్‌కు గురి కాగా ఆ కుటుంబాన్ని పరామర్శించి తన వంతు సహాయ సహకారాలందిస్తానని తెలిపారు. అదే విధంగా ఆయా వార్డులలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.రాజా తదితరులున్నారు. అన్న క్యాంటీన్ భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



సమస్యలు పరిష్కరించాలని నిరసన

మాచర్ల: కోవిడ్ మహమ్మారి కష్టకాలంలో పనిచేసిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకొని వారికి పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల మహేష్ కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన వారిలో ఆయన సీఐటీయూ నాయకులు, కాంట్రాక్టు కార్మికులతో కలిసి మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం పురపాలక సంఘ కార్యాలయం బయట విలేకరులతో మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుంచి మాచర్ల మున్సిపల్ శానిటరీ సెక్షన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఇప్పటికీ జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వారు కరోనా కాలంలో ప్రాణాలను పణంగా పెట్టి కష్టపడి పనిచేశారన్నారు. పట్టణంలో ప్రజానీకం పెరుగుతున్న తరుణంలో అదనపు పనులకు టెండర్లు వేసి కాంట్రాక్టు కార్మికులను కొనసాగించి పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పశు వైద్యాధికారి షేక్ బషీర్



మందులు పంపిణీ చేస్తున్న వైద్యుడు

రెంటచింతల: రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం నుంచి ఏర్పాటు చేస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి షేక్ బషీర్ కోరారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పశు ఆరోగ్య శిబిరాలను ఈ నెల 21న రెంటాల, 22న మిట్టగుడిపాడు, 23న గోలి, పాలువాయి, 24న మల్లవరం, పాలువాయిగేటు, రెంటచింతల, 25న జెట్టిపాలెం, మంచికల్లు, 27న తుమ్మకోట, 28న పశర్లపాడు గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరాలలో ఉచిత పశు ఆరోగ్య పరీక్షలు, తేలికపాటి శస్త్రచికిత్సలు, ఎదకురాని, చూలు కట్టని, ఇతర గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగు వైద్యం చేయడం జరుగుతుందన్నారు. పశువులకు, దూడలకు, సన్న జీవాలకు నట్టల నివారణ మందు, పశువులకు, కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేయడంతోపాటు పశు పోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతులపై అవాహన కల్పించడం జరుగుతుందన్నారు. మండలంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి శిబిరాలను నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని పశు యజమానులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పశువైద్య శిబిరం ప్రారంభం

కారంపూడి: స్థానిక పశు వైద్యశాలలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ వైద్యుడు దిలీప్, సిబ్బంది బొగ్గవరపు బ్రహ్మం తదితరులు పశువులకు వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని వైద్యుడు దిలీప్ తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తండా మస్తాన్ జానీ, బాణావత్ బాలునాయక్, కటికల బాలకృష్ణ తదితరులున్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ వితరణ



మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన దాతలు

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.5 లక్షలతో పాఠశాల పూర్వ విద్యార్థిని ఉమా సుందరి జ్ఞాపకార్థం నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంటును సోమవారం ఆమె వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రారంభించారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో కాజ గ్రామానికి చెందిన ఉమాసుందరి భర్త సింహాద్రి లీలా ప్రసాదరెడ్డి, కుమారులు మనోదిలీప్ రెడ్డి, రాజీవ్‌రెడ్డి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల అభివృద్ధికి దాతలు, పూర్వ విద్యార్థులు ముందుకు రావడం హర్షణీయమని ఎంఈఓ టి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి.శివ సుందరరెడ్డి, తిరుపతి రెడ్డి, జె.సాంబిరెడ్డి, శివారెడ్డి, శ్యామ్, వెంకటరెడ్డి, మంజులత, ప్రమీల, క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రొఫెసర్ డేవిడ్ రాజు, పాఠశాల హెచ్ఎం ఎ.శ్రీనివాసరెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ జి.పున్నారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిషర్ మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా పుల్లయ్య



సొసైటీ ఎన్నికల్లో పాల్గొన్న సభ్యులు

సత్తెనపల్లి: ది వడ్డవల్లి ఫిషర్ మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా మంగళపూరి పుల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో ది వడ్డవల్లి ఫిషర్ మెన్ కో–ఆపరేటివ్ సహకార సంఘం లిమిటెడ్ పాలక వర్గ ఎన్నిక సోమవారం పట్టణంలో గుంటూరు న్యాయవాది షేక్ అబ్దుల్ ఘని ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉపాధ్యక్షుడిగా సాధు బాలాజీ, కార్యదర్శిగా మంగళపూరి శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. పాలకవర్గ సభ్యులుగా మంగళపూరి శ్రీనివాసరావు, పిట్టల ఏసుబాబు, మంగళపూరి శ్రీనివాసరావు అలియాస్ శీనయ్య, మంగళపూరి పుల్లయ్య, మంగళపూరి ఆదెయ్య, సాధు బాలాజీ, మారం శేషగిరిరావు, సాధు నాగేశ్వరరావు, గరిక వెంకయ్య ఎన్నికయ్యారు. వీరి పదవి కాలం 2030 జనవరి 20 వరకు ఐదేళ్ల పాటు కొనసాగనుంది.

గ్రంధశిరిలో కార్డన్ సెర్చ్
– 15 ద్విచక్ర వాహనాలు సీజ్



అచ్చంపేట: యువత గంజాయి, మత్తు పానీయాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు హితవు పలికారు. గ్రంధశిరిలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులనుద్దేశించి డీఎస్పీ మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాల్లో 24 గంటలూ పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ప్రతి ఇంటిని తనిఖీ చేస్తామన్నారు. గ్రూపులుగా ఏర్పడి గొడవలు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తనిఖీల్లో అచ్చంపేట సీఐ వెంకట ప్రసాద్, 60 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.